ఘనంగా పోచమ్మ బోనాలు



నవాబుపేటలో పోచమ్మ బోనాలతో గుడికి వెళ్తున్న భక్తులు



వెలిశాలలో పోచమ్మ బోనాల పండుగలో పాల్గొన్న భక్తులు

చిట్యాల: మండలంలోని నవాబుపేట, జూకల్ గ్రామాల్లో శ్రావణమాసం సందర్భంగా బుధవారం పోచమ్మ బోనాలు గ్రామస్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. పోచమ్మతల్లికి బోనంతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు గ్రామస్తులంతా డప్పుచప్పుళ్లతో శివసత్తు లపూనకాల మధ్య ఆటపాటలు, బోనాలు, యాటపోతులతో గుడికి వెళ్లారు.

వెలిశాలలో..

టేకుమట్ల: మండలంలోని వెలిశాలలో బుధవారం పోచమ్మ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పోచమ్మ తల్లికి బోనాల సమర్పించి, మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతలపెల్లి విజయాస్వామిరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తిర్మలాపూర్ గ్రామపంచాయితీ అమ్లెట్ పల్లె రాంచంద్రాపూర్ గ్రామాన్ని ఇటీవల నూతన గ్రామపంచాయతీగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతాభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి భూపాలపల్లి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి హాజరై మాట్లాడారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పని చేస్తున్నారని అన్నారు. ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని భూపాలపల్లి నియోజకవర్గంలో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్రె సాగర్, రైతు బంధు సమితి మండల అధ్యక్షులు మడికొండ రవీందర్ రావు, మండల నాయకులు కట్కూరి నరేందర్, పీసరి సురేష్, పాశం శివన్నారాయణ, గ్రామస్తులు గాజె అశోక్, క్యాతం రమేష్, నర్సింగం, కుమార స్వామి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల దీక్ష



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

పలిమెల : తమ న్యాయమైన సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షలు బుధవారం మూడో రోజు కొనసాగాయి. మండలంలోని త హసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ని ర సన తెలిపారు. అంగన్‌వాడీలకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, తదితర స మస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు సత్యవతి, సుశీల, కిష్టబాయి, శివమ్మ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

సన్మానం

మహాముత్తారం: మండలంలోని బోర్లగూడెం గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం గ్రామస్తులు, దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఏకాం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చందుపట్ల సునీల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సునీల్‌రెడ్డిని సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు సంపత్, బీజేపీ నాయకులు రాజు, శేఖర్, కుమార్, హర్ష, యువరాజ్, లక్ష్మణ్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన పాలకుర్తి ప్రభు అక్రమంగా గుడంబాను తయారు చేస్తుండగా దాడిచేసి ఆరు లీటర్ల గుడంబాను స్వాధీనం చేసుకున్నట్లు భూపాలపల్లి ఎక్సైజ్ శాఖ ఎస్సై మాన్‌సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం అతనిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. ఎక్సైజ్ కానిస్టేబుళ్లు రఘుపతి, విజయ్ కుమార్, ముజాఫర్ హైస్సేన్ తదితరులు ఉన్నారు.

ఇద్దరి బైండోవర్

పలిమెల : మండలంలోని పంకెన, లెంకలగడ్డ గ్రామాల్లో గుడుంబా విక్రయించే ఇద్దరిని బుధవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తమాషారెడ్డి తెలిపారు. గుడుంబా తయారు చేసినా.. విక్రయించినా.. సరఫరా చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగుల భిక్షాటన

భూపాలపల్లి అర్బన్: విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు బుధవారం జిల్లా కేంద్రంలో భిక్షాటన చేశారు. కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న నిరహార దీక్షలు 13వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జేఏసీ ప్రధాన కార్యదర్శి తోకల వేణు మాట్లాడుతూ.. విద్యాశాఖలో కీలకంగా పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షులు రఘు, నాయకులు సాంబమూర్తి, ప్రసాద్, ప్రతాప్‌లు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు చాంద్‌పాషా, మహేందర్, చల్ల సునీత, చంద్రకళ, సుదర్శన్, సంపత్, చంద్రమౌళి, కుమార్, హరీశ్, రాజు, తిరుపతి, రాజయ్య పాల్గొన్నారు.

ఘనంగా పోషణ మాసోత్సవం



పోషణ మాసోత్సవంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ టీచర్

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని రామన్నగూడెంతండా అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ బుర్ర సరస్వతి ఆధ్వర్యంలో బుధవారం పోషణ మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు చేసి, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్ మాట్లాడుతూ గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు ఆకు కూరలు, పాలు, గుడ్లు, పప్పులను ఎక్కువ మోతాదులో తీసుకుని మాంసాహారాన్ని తక్కువ మోతాదులో తీసుకోవాలని సూచించారు. బిడ్డకు ఆరు నెలలు నిండగానే తల్లిపాలతో పాటు, అదనపు ఆహారాన్ని అందించాలన్నారు. కిశోర బాలికలకు రక్తహీనత రాకుండా ఉండేందుకు ప్రోటీన్స్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని, చిరుధాన్యాలతో ఆరోగ్యం సంపూర్ణంగా ఉంటుందని, కావున ప్రతీ ఒక్కరు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కామిడి సతీష్‌రెడ్డి, అంగన్‌వాడీ ఆయాలు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీ



గొర్రెలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

భూపాలపల్లి రూరల్: మండల పశువైద్యాధికారి తిరుపతి ఆధ్వర్యంలో భూపాలపల్లి మండలంలోని గోర్లవీడులో లబ్ధిదారులకు రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈకార్యక్రమానికి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ, మండల ఎంపీపీ మందల లావణ్య ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా లావణ్య మాట్లాడుతూ.. అధికారుల సూచన మేరకు డీడీలు తీయాలన్నారు. ఈసందర్భంగా మండల పశువైద్యాధికారి తిరుపతి మాట్లాడుతూ రెండో విడత 100 మంది లబ్ధిదారులకు గాను 25 మంది డీడీలు తీయగా.. 24 మందికి గొర్రెల్ని పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తాటి కంటి శంకరయ్య, మాజీ ఎంపీపీ రఘుపతిరావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ విద్యాసాగర్‌రెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ మామిడి రాజకుమార్, సభ్యులు బండి శ్రీనివాస్, లబ్ధిదారులు అనిల్, గౌడ మహేశ్, బూర్గుల రామస్వామి, బందరి సమ్మయ్య, బూర్గుల అశోక్, దొంగల ఐలు కోమురు, అన్న గోపయ్య, బండారి రవి, చరాల శ్రీకాంత్, కుమార్, సుధాకర్, గౌడ కొండయ్య, కాట్రావుల రాజబాబు, వెటర్నరీ అసిస్టెంట్ విజయ్, గోపాలమిత్ర రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దొంగిలించిన సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

టేకుమట్ల(రేగొండ): దొంగిలించిన వెండి, బంగారం స్వాధీనం చేసుకున్న రేగొండ పోలీసులు నిందితురాలిపై బుధవారం కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ వేణుచందర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. రేగొండ మండలంలోని లింగాలలో గజ్జి సమ్మక్క ఇంట్లో మార్చి 5న చోరీ జరిగింది. దీంతో బాధితురాలు రేగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టిన ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి రేగొండ మండలంలోని చిట్యాల క్రాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న పరకాల మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కేతిరి లక్ష్మీని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా నేరం ఒప్పుకుని 30తులాల వెండి, నాలుగు తులాల బంగారం తిరిగి అందించినట్లు తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



చిట్యాల: మండలంలోని నవాబుపేట, టేకుమట్ల మండలంలోని సుబ్బక్కపల్లి గ్రామాల మధ్య ఇటీవల కురిసిన వర్షాలకు వంక సముద్రం చెరువు తెగపోయింది. దీంతో మంగళవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నేరేళ్ల ఓదేలు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ అక్కడి పరిస్థితిని పరిశీలించారు. ఈ మేరకు 'రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి' శీర్షికను సాక్షిలో వచ్చిన కథనానికి స్పందించిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి బుధవారం లారీలతో రోడ్డుపై మొరం పోసి చదును చేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, వాహనాదారులు ఎమ్మెల్యేకు, సాక్షికి కృతజ్ఞతలు తెలియజేశారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కాటారం: మండలంలోని కొత్తపల్లి, దేవరాంపల్లి గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. గ్రామాల్లో పలు వ్యాధులతో బాధపడుతున్న రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మాత్రలు పంపిణీ చేశారు. ఆశాకార్యకర్తలు జ్వరాలతో బాధపడుతున్న రోగుల ఇంటి వద్దకు వెళ్లి రక్తపూతలు స్వీకరించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు అనుసరించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత ముఖ్యమని ప్రతి శుక్రవారం డ్రైగా పాటిస్తూ ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రపర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మౌనిక, సుమన్, వందన, నిర్మల, నాగరాణి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చిట్యాల: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడుతాయని ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని చల్లగరిగ ఉన్నత పాఠశాలలో 67వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి హజరై క్రీడలను ప్రారంభించారు. అనంతరం అమె మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఇలాంటి క్రీడలు నిర్వహించడం సంతోషకరమన్నారు. అలాగే ఎంఇఓ రఘుపతి మాట్లాడుతూ క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామయ్య, సర్పంచ్ కర్రె మంజుల అశోక్ రెడ్డి, పాఠశాల చైర్మన్ ప్రభాకర్, ఇన్‌చార్జ్ హెచ్ఎం సరిత, పీఈటీ లు లింగమూర్తి, స్వరూపరాణి, సాంబరాజు, భాస్కర్‌రావు, సమ్మయ్య, సీనియర్ క్రీడాకారుడు ఎండీ రబ్బాని, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయాన్ని విస్మరించిన ప్రభుత్వాలు



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

టేకుమట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాజిక న్యాయాన్ని విస్మరించాయని జిల్లా ప్రచార కమిటీ సభ్యులు కొత్తూరి రవీందర్ అన్నారు. బుధవారం ధర్మ సమాజ్‌పార్టీ మండల ప్రచార కమిటీ సభ్యుడు ఆకినపల్లి శ్యామ్ ఆధ్వర్యంలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 7శాతం లేని అగ్ర కులాలు 7 రాజకీయ పార్టీలకు నాయకత్వం వహించడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా అగ్రకుల నాయకులు పార్టీల నాయకత్వాన్ని బీసీలకు అందించాలని, ముఖ్యమంత్రి స్థానాన్ని దళితులకు కేటాయించాలని, కేబినెట్ మొత్తం 93శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలని, రాష్ట్ర బడ్జెట్‌లో 90శాతం అణగారిన వర్గాలకు కేటాయించాలని, తదితర అంశాలతో కూడిన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, అశోక్, లక్ష్మణ్, సంగి మధూకర్, భాస్కర్, పాల్, తిరుపతి, వెంకటేష్, గణేష్, సుభాష్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మధు

మహదేవపూర్: మండలంలోని బొమ్మపూర్ గ్రామానికి చెందిన గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండం నరేందర్‌రెడ్డి కుదురుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు 13 మంది బుధవారం బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ అభ్యర్థి పుట్ట మధు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కుదురుపల్లి గ్రామానికి చెంది కాంగ్రెస్ యూత్ నాయకులు గోగుల మధు, అమురాజి సాగర్, గోగుల కిష్టయ్య, అశోక్, అమురాజి వెంకటేష్, శ్రీరాముల మల్లయ్య, రాజయ్య, లెంకల వంశి, కోయం శశికాంత్, కొర్తె పోచయ్య, గోగుల వెంకటయ్య బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రైతు బంధు సమితి అధ్యక్షుడు బండం లక్ష్మారెడ్డి, చాల్ల తిరుపతి రెడ్డి, సర్పంచ్ శ్రీపతి బాపు, మండల ప్రధాన కార్యదర్శి కిరణ్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కారెంగుల బాపురావు, యూత్ అధ్యక్షుడు కురతోట రాకేష్, రాజశేఖర్, మహేష్ పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

పలిమెల : మహిళలకు వారి రక్షణ చట్టాలపై అవగాహన ఉండాలని పలిమెల ఎస్సై జి.తమాషారెడ్డి అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా బుధవారం మండలంలోని బూరుగూడెం గ్రామంలోని ప్రజలతో ఎస్సై తమాషారెడ్డి మాట్లాడుతూ మహిళల పై జరిగే నేరాల గురించి , వారి రక్షణ చట్టాల గురించి, షీ టీమ్ ప్రాముఖ్యత గురించి గ్రామస్తులకు వివరించారు. 18 సంవత్సరాలు నిండితన తర్వాతనే పిల్లలకు పెళ్లి చేయాలని లేదంటే చిన్న పిల్లలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుందని సూచించారు. అలాగే అనుమానితులకు ఎవ్వరు కూడా ఆశ్రమం ఇవ్వదని, గ్రామంలోకి కొత్త వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీధర్‌బాబు చొరవతోనే చెరువులకు మరమ్మతులు



సమావేశంలో మాట్లాడుతున్న సమ్మయ్య

కాటారం: భారీ వర్షాలతో గత ఏడాది తెగిపోయిన వీరాపూర్, గూడూర్, రుద్రారం చెరువులు ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు చొరవతోనే మరమ్మతుకు నోచుకుంటున్నాయని ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి విలాస్‌రావు అన్నారు. కాటారం మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. చెరువుల మరమ్మత్తులకు ఎమ్మెల్యే నిధులు తీసుకు రావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. పెద్దపల్లి, జయశంకర్‌భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ అధికార పార్టీలో ఉన్నప్పటికీ చెరువులు మరమ్మతుకు నోచుకోలేదని ఆరోపించారు. వేలాది ఎకరాల పొలాలు నిరూపయోగంగా మారినా ఏనాడు వారు పట్టించుకోలేదని విమర్శించారు. మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు అసెంబ్లీలో పోరాడి చెరువుల మరమ్మతుకు నిధులు తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఎన్నికల కోసం ప్రగల్భాలు పలికే బీఆర్ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్, నాయకులను ప్రజలు నమ్మరని తగిన బుద్ధి చెపుతారని అన్నారు. ఈ సమావేశంలో మల్హర్ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, ఎంపీటీసీ మహేశ్ రవీందర్‌రావు, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, కుమ్మరి అశోక్, కొట్టె శ్రీహరి, కొట్టె ప్రభాకర్, సత్యనారాయణ, చక్రపాణి, కిరణ్, పృథ్వి, రాజేశ్, శశి తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ పోరాట ఫలితమే ఎరియర్స్

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికులకు ఒకేసారి ఎరియర్స్ చెల్లించాలని కోరుతూ.. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేసిన పోరాటాల ఫలితంగానే ఎరియర్స్ సాధించుకున్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. కోల్ ఇండియాలో ఒకేసారి ఎరియర్స్ చెల్లించాలని కోల్ ఇండియా ప్రకటన చేసినా కానీ.. సింగరేణిలో కనీసం ఎరియర్స్ తేదీ కూడా ప్రకటించకుండా సింగరేణి యాజమాన్యం స్పందించకపోవడంతో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అన్ని జీఎం కార్యాలయాల ఎదుట నిరాహార దీక్షలు చేసినట్లు తెలిపారు. ఈనెల 21న ఎరియర్స్ చెల్లించడానికి ఒప్పుకుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాతాంగి రామచందర్, కృష్ణమూర్తి, మల్లికార్జున్, సాంబయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపటి నుంచి టోర్నమెంట్ ఎంపికలు

టేకుమట్ల(రేగొండ): 67 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండల స్థాయి క్రీడా టోర్నమెంట్ సెలెక్షన్‌లను రేపటి (శుక్రవారం) నుంచి రేగొండ మండలంలోని మడ్తపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి వేల్పుల ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, అండర్ 17 బాల బాలికలకు ఖోఖో, ఖబడ్డీ, వాలీబాల్ క్రీడా టోర్నమెంట్ సెలెక్షన్‌లు ఉంటాయని క్రీడలలో పాల్గొనే విద్యార్థులు స్టడీ, కండక్ట్ సర్టిఫికెట్లు తీసుకుని నేడు(శుక్రవారం) మండలంలోని రేపాక ఉన్నత పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు మండల కన్వీనర్ ప్రతాప్‌కు అందించాలని, మరిన్ని వివరాలకు 99631 73486 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మహాముత్తారం: మండలంలోని సింగారం గ్రామసమీపంలోని అడవిలో అదే గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని సమాచారం తెలుసుకున్న మహాముత్తారం ఎస్సై సుధాకర్ బుధవారం దాడి నిర్వహించారు. పేకముక్కలతోపాటు రూ.700 స్వాధీనం చేసుకుని ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరామర్శ

కాటారం: మండల కేంద్రానికి చెందిన గడ్డం లచ్చయ్యయాదవ్ ఇటీవల మృతి చెందగా బుధవారం బీజేపీ నాయకులు పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి లచ్చయ్య మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి బియ్యం అందజేసినట్లు మండల ప్రధాన కార్యదర్శి పూసాల రాజేంద్రప్రసాద్ తెలిపారు. దుర్గం తిరుపతి, కొండ రాజమల్లు, అంకయ్య, గంట నరేశ్, నాగరాజు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరానికి చెందిన నిరుపేద విద్యార్థి అశ్రభాను బీటెక్ హనుమకొండలో చదువుతుంది. కాగా, ఆమె చదువుకు ఉపయోగపడేలా ప్రొత్సాహకంగా కాళేశ్వరం సర్పంచ్ వెన్నపురెడ్డి వసంత -మోహన్‌రెడ్డి దంపతులు రూ.16వేల విలువ గల సెల్‌ఫోన్ బుధవారం జెడ్పీ చైర్ పర్సన్ పుట్ట మధుకర్ చేతుల మీదుగా విద్యార్థి తండ్రి మునీర్‌కు అందజేశారు. కుటుంబ సభ్యులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట ఎంపీటీసీ మమత, నాగరాజు ఉన్నారు.

పరిశీలన

మహదేవపూర్: మండలంలోని అంబట్‌పలిలోని హరితహారంలో మొక్కలు నాటే ప్రదేశాన్ని బుధవారం ఆకస్మికంగా ఎంపీడీఓ రవీంద్రనాథ్ పరిశీలించారు. లక్ష్యం పూర్తి చేయకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్ రాజబాపుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల్లో లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశించారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను ఏసీఎంఓ టీడబ్ల్యూ (అకాడమిక్ కమ్యునిటీ మొబిలైజేషన్ ఆఫీసర్) రవిశంకర్ బుధవారం సందర్శించారు. విద్యార్థుల ఎఫ్ఏ రికార్డులు, తరగతులను పరిశీలించారు. వారికి తగు సూచనలిచ్చారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పదోతరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధన కోసం కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలిచ్చారు. వారితో హెచ్ఎం సునీత, అమల, శ్రీశైలం, శేఖర్‌రెడ్డి ఉన్నారు.

ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠాపన

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయం ఎదుట నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాల్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అచలాపురం వేద పాఠశాలకు చెందిన బ్రహ్మశ్రీ దుద్దిళ్ల మనోహర అవధాని ఆధ్వర్యంలో పంచసూక్త రుద్ర, చండీ హవనం, శాంతి పౌష్టిక హోమాలు, బలిప్రదానం, తీర్థ ప్రసాద వితరణ, భక్తులకు భారీ అన్నదాన సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ పుట్ట మధుకర్, ఈఓ మహేశ్, దేవస్థానం చైర్మన్ శ్రీనివాసరావు, కాళేశ్వరం, మహదేవపూర్ సర్పంచ్‌లు వసంత, బాపు, ఎంపీటీసీ మమత, జెడ్పీటీసీ అరుణ, మార్కెట్ కమిటీ చైర్మన్ మమత, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతి, ధర్మకర్తలు సమ్మయ్య, రాంరెడ్డి, భానుప్రకాశ్, పద్మ, సత్యానారాయణ, దేవేందర్, రాజయ్య, ప్రశాంత్‌రెడ్డి, రమేశ్‌బాబు, దేవేందర్‌రెడ్డి, ఎక్స్ అఫీషియో మెంబర్ కృష్ణమూర్తిశర్మ, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఏఈ దుర్గాప్రసాద్, సీఐ కిరణ్, ఎస్సై లక్ష్మణ్‌రావు ఉన్నారు.

బిల్లు ప్రవేశపెట్టాలి

భూపాలపల్లి రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బట్టు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు బుధవారం కొనసాగాయి. నాయకులు బొల్లిబాబు, మండల రవీందర్‌రెడ్డి దీక్షలు ప్రారంభించి మద్దతు తెలిపారు. భిక్షపతి, సురేష్, అశోక్, రాజేందర్ ఉన్నారు.